క్లుప్తంగా

నేడు, రేపు కబడ్డీ పోటీలు

దాచేపల్లి : దసరా పండగ సందర్భంగా ఈనెల 9, 10 తేదీల్లో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని ముత్యాలంపాడు రోడ్డులోని బీసీ కాలనీలో ఈ పోటీలు జరుగుతాయని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు 8121817487 నంబర్‌ని సంప్రదించాలని వారు కోరారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం



దాచేపల్లి : స్వచ్ఛ గ్రామ పంచాయతీలే లక్ష్యంగా అందరం పనిచేయాలని ఎంపీపీ కందుల జాను అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్ల సమావేశం మంగళవారం జరిగింది. గ్రామ పంచాయతీల అభివృద్ధి, వనరులు తదితర అంశాలపై చర్చించారు. ప్రజలు ఆరోగ్యకరంగా ఉండేందుకు గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం పనులు రోజు చేపట్టాలని, చెత్తచెదారం, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ జాను చెప్పారు. ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేసి గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని, మంచినీరు, విద్యుత్ సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, ఎంపీడీఓ రామకృష్ణ, ఈవోపీఆర్డీ నాగేంద్ల రత్నం, సూపరింటెండెంట్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి మేనిఫెస్టో విడుదల

మాచర్ల: కృష్ణా–గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగనున్న లగడపాటి వేణుగోపాల్ మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో తన మేనిఫెస్టోను విడుదల చేశారు. ఉపాధ్యాయ, నిరుద్యోగ, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పలు హామీలను అందులో పొందుపరిచారు. గ్రాడ్యుయేట్లందరూ ఓట్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

ఎంపీడీఓ సరోజినీదేవికి పౌర సన్మానం



రెంటచింతల: రెంటచింతల ఎంపీడీఓగా కొత్తగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సరోజినీదేవిని మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు, వైఆర్‌ఎస్ స్కూల్ కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య, ఆకుల నర్సింహారావు మంగళవారం దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సరోజినీదేవి మాట్లాడుతూ గ్రామ పెద్దలు స్థానిక అధికారులకు సహకరించినప్పుడే గ్రామాభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.



గురజాల రజక వీధిలో శాంకంబరిదేవి అలంకరణలో అమ్మవారు



మాచవరం శివాలయంలో ధనలక్ష్మిగా అమ్మవారు



విజయపురిసౌత్‌లోని మెయిన్ బజార్‌లో రూ.ఏడు లక్షల 88 వేల అలంకారంలో మహాలక్ష్మిగా..



పాత మాచర్లలో రూ.ఐదు లక్షల అలంకరణలో ధనలక్ష్మిగా వాసవీమాత

అమృత వర్షిణీ.. అపురూపిణీ

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కటాక్షించారు. వరాల సిరులు కురిపించే ధనలక్ష్మిగా కొన్నిచోట్ల భక్తులను కరుణించారు. వివిధ అలంకరణల్లో మెరిశారు. భక్తులు అమ్మవార్ల దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా తిలకించి పులకించారు. అమృత వర్షిణీ.. అపురూపిణీ నమోస్తుతే అంటూ ప్రణమిల్లారు.


– మాచర్ల/విజయపురిసౌత్/దాచేపల్లి/రెంటచింతల/మాచవరం/పిడుగురాళ్ల/గురజాల



రెంటచింతల మండలం సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



గురజాల పాతపాటేశ్వరి అమ్మవారి ఆలయంలో సంతాన లక్ష్మీ అలంకరణలో అమ్మవారు



దాచేపల్లిలోని రెడ్ల బజార్‌లో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



రెంటచింతలలో ధనలక్ష్మిగా శ్రీవాసవీమాత



పిడుగురాళ్ల బ్రహ్మంగారి గుడిలో రూ.3 లక్షల నగదుతో ధనలక్ష్మీ అలంకారం..



పిడుగురాళ్ల నాగుల గుడిలో నెమలి పించములతో ప్రత్యేక అలంకారం

పిడుగురాళ్ల ఎస్‌ఐగా శివనాగరాజు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ ఎస్‌ఐగా శివనాగరాజు బాధ్యతలు స్వీకరించారు. దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న శివనాగరాజు సాధారణ బదిలీల్లో భాగంగా పిడుగురాళ్ల ఎస్‌ఐగా బాధ్యతలను చేపట్టారు. ఎన్నికల తర్వాత పిడుగురాళ్ల పట్టణ ఎస్‌ఐ అమీర్ బదిలీపై వెళ్లటంతో అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ పోస్టులో శివనాగరాజు హాజరయ్యారు.

డెప్యూటీ తహసీల్దార్‌గా సుధాకర్ శర్మ



పిడుగురాళ్ల: డెప్యూటీ తహసీల్దార్‌గా సుధాకర్ శర్మ బాధ్యతలను స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా పిడుగురాళ్ల డెప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ధనలక్ష్మి నాదెండ్ల మండలానికి బదిలీ అయ్యారు. మాచర్ల డెప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై సుధాకర్ శర్మ పిడుగురాళ్ల డెప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలను స్వీకరించారు.

ఎంపీడీఓకు సత్కారం



గురజాల : ఎంపీడీవో గౌసియా బేగంను మండల పరిషత్ కో– ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్ సత్కరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఆర్.ఫణికుమార్ నాయక్ సాధారణ బదిలీల్లో భాగంగా మాచర్లకు వెళ్లారు. రెంటచింతల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న షేక్ గౌసియా బేగంను గురజాల ఎంపీడీఓగా బదిలీ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ బేగంను ఎంపీపీ ఆదేశాల మేరకు దుశ్శాలువాలతో సత్కరించారు.

మరొకరితో సహజీవనం చేస్తూ భార్యపై వేధింపులు

- నగ్నంగా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్
- నిందితులను అరెస్ట్ చేయాలని డీఎస్పీని కోరిన బాధితురాలు

నరసరావుపేటటౌన్: తన భర్త మరో యువతితో సహజీవనం చేస్తూ అడిగినందుకు తనపై దాడి చేయటంతో పాటు నగ్నంగా వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారని బాధితురాలు మంగళవారం డీఎస్పీ కె.నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేసింది. అనంతరం చిలకలూరిపేట పట్టణానికి చెందిన బాధిత మహిళ డీఎస్పీ బంగ్లా ఎదుట విలేకరులతో మాట్లాడింది. తన భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని తెలిపింది. ఈ వ్యవహారంపై ప్రశ్నించినందుకు సదరు మహిళ కొంత మందితో ఇంట్లోకి దౌర్జన్యంగా వచ్చి దాడి చేశారని తెలిపింది. తనను నగ్నంగా చేసి వీడియోలు తీశారని వాటిని సోషల్ మీడియాలో పెట్టారని వాపోయింది. ఫిర్యాదు చేయటంతో ఏడాది క్రితం చిలకలూరిపేట పట్టణం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపింది. అయితే నిందితులను అరెస్ట్ చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంది.

భర్త ప్రవర్తన మార్చుకోకపోవటంతో ఐదు నెలల క్రితం విడాకులు తీసుకున్నట్లు తెలిపింది. నిందితులను అరెస్ట్ చేసి తనకు న్యాయం చేయాలని కోరింది.

యువకుడిపై దాడి

నరసరావుపేటటౌన్: స్వల్ప వివాదం నేపథ్యంలో యువకుడిపై ఐదుగురు యువకులు దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాలెంనగర్‌కు చెందిన చావ లక్ష్మీనారాయణపై నాగబాబు మరో నలుగురు కలిసి దాడి చేశారు. ఈమేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్‌చరణ్ తెలిపారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు



దాచేపల్లి : జమ్మూకాశ్మీర్‌లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లు సాధించటం పట్ల ఆ పార్టీ నాయకులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. నారాయణపురంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మైనార్టీ విభాగం మాజీ కార్యదర్శి కరాలపాటి జానీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుని స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాదాసు ఆదినారాయణ, రమేష్, సైదా, వలి, అప్పారావు, శ్రీను, అంకారావు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామం సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృత్యువాత పడిన కవలకుంట సతీష్ మృతదేహం మంగళవారం ఉదయం గుర్తించినట్లు ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో మృతదేహం కోసం పోలీసు, రెవెన్యూ సిబ్బంది కుటుంబ సభ్యులు కాల్వ వెంట వెతుకులాట చేస్తుండగా అడవిపాలెం లాకుల వద్ద మృతదేమం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

నరసరావుపేట రూరల్: మద్యానికి బానిసైన ఆటో డ్రైవర్ తమ్మిరాజు(35) పురుగుమందు సేవించి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రూరల్ ఎస్‌ఐ కిషోర్ మంగళవారం సాయంత్రం తెలిపారు. భార్య కుమ్మెర శివదుర్గ సోమవారం రాత్రి ఫిర్యాదు చేసిందన్నారు. మూడురోజుల క్రితం లింగంగుంట్ల కాలనీలోని ప్రభుత్వాసుపత్రి పరిసరాల్లో తన భర్త ఆటోలో పురుగుమందు సేవించి ఉండగా మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లటం జరిగిందన్నారు.

వన్యప్రాణులను కాపాడుదాం

కారెంపూడి: స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో ఫారెస్ట్ అధికారులు వన్య ప్రాణి సంరక్షణ ముగింపు వారోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అడవులను రక్షించుకుందాం.. వన్యప్రాణులను కాపాడుకుందాం అనే నినాదంతో ఉన్న పోస్టర్‌తో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వన్యప్రాణి సంరక్షణకు అడవులను కాపాడుకోవాల్సిన అవసరాన్ని కారెంపూడి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ షేక్ అమీర్ జానీ బాష విద్యార్థులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన ఆవశ్యకత ప్రస్తుతం కన్పిస్తోందని, భవిష్యత్తులో పర్యావరణ సమతుల్యత లోపించడం వల్ల వచ్చే అనర్థాలను భావితరాలకు రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ పట్ల శ్రద్ధ పెట్టాలని వివరించారు. రెండో తేదీ నుంచి జరుగుతున్న వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయని ఆయన పేర్కొన్నారు. అడవులు బాగుంటే వన్యప్రాణుల మనుగడ సాగించడంతోపాటు అవి వృద్ధి అవుతాయని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ స్వర్ణరాజు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రదర్శన నిర్వహిస్తున్న బీట్ ఆఫీసర్ అమీర్‌జానీ బాషా, సిబ్బంది

వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి

రెంటచింతల: రాష్ట్రంలో గ్రామ వలంటీర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని పల్నాడు జిల్లా గ్రామ వలంటీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొండాటి రాజు కోరారు. మంగళవారం ఏపీ గ్రామ వలంటీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ హుమాయున్‌బాష ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు బోనం మర్రెడ్డి, గ్రామ వలంటీర్స్‌తో కలిసి ఎంపీడీఓ సరోజినీదేవికి వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. వలంటీర్లను తక్షణమే విధుల్లో తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.10 వేలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలను వెంటనే చెల్లించాలని, రాజీనామా చేసిన వలంటీర్లవి బలవంతపు రాజీనామాలుగా పరిగణించి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 10 జరగనున్న రాష్ట్ర క్యాబినేట్ మీటింగ్‌లో వలంటీర్ల వ్యవస్థపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెన్నా అవినాష్‌రెడ్డి, ఇబ్రహీం, నల్లపు కొండమ్మ, ప్రమీల, జక్కా సౌజన్య, సుజాత, అనూషా, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ సరోజినీదేవికి వినతిపత్రాన్ని అందజేస్తున్న వలంటీర్ల సంఘ నేతలు

11న బతుకమ్మ అలంకరణ పోటీ

నరసరావుపేట ఈస్ట్: శ్రీవాసవీ మిత్రమండలి ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయం వద్ద వాసవీ, బతుకమ్మ అమ్మవార్ల బొమ్మల అలంకరణ పోటీలు నిర్వహిస్తున్నట్లు మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. పోటీలో పాల్గొనేవారు తమ ఇంటి వద్దనే బొమ్మలను అలంకరించుకొని తీసుకుని రావాలన్నారు. పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, రెండు కన్సోలేషన్ బహుమతులతో పాటు ఎంపిక చేసిన 45 మందికి చీరలు, పాల్గొన్న వారికి ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. పోటీలో పాల్గొనేవారు తమ పేర్లను 9246453348, 9848147744, 7337071287, 7075740630 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఆర్టీసీ ప్రథమ నిర్లక్ష్యం

బస్సుల్లో కానరాని ఫస్ట్ ఎయిడ్ కిట్లు

- అలంకార ప్రాయంగా బాక్సులు
- కొన్ని బస్సుల్లో గడువుతీరిన మందులు
- ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స కూడా కరువే

సత్తెనపల్లి: ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణం సురక్షితం అనేది నినాదానికి మాత్రమే పరిమిత మవుతోంది. ఆర్టీసీ ప్రయాణికుల భద్రతను అధికారులు గాలికొదిలేశారు. ప్రయాణ సమయంలో ఏదైనా అనుకోని ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స అందించేందుకు బస్సుల్లో ఉంచాల్సిన ఫస్ట్ ఎయిడ్ కిట్లు బస్సుల్లో మచ్చుకైనా కనపడటం లేదు. పలు బస్సుల్లో బాక్సులు ఉన్నప్పటికీ అవి అలంకార ప్రాయంగా మారాయనే చెప్పవచ్చు. అయితే బాక్స్‌లో పూర్తిస్థాయిలో అన్ని వస్తువులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్న కనీస విషయాన్ని ఆర్టీసీ అధికారులు విస్మరించారు. కొన్ని బస్సుల్లో గడువు తీరిన మందులు ఉంచారు.



పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఉన్న ఆర్టీసీ బస్సు



అలంకార ప్రాయంగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్



కొన్న బస్సుల బాక్స్‌లో గడువు తీరిన మందులు

ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాల్సిన కూటమి ప్రభుత్వం మొద్దు నిద్రపోతుంది. మందుల కొనుగోలుకు నిధులు కేటాయించక పోవడంతో ఆర్టీసీ అధికారులు ఆస్పత్రులు, దాతల కోసం ఎదురుచూస్తున్నారు.

సత్తెనపల్లి డిపో పరిధిలో...

సత్తెనపల్లి ఆర్టీసీ డిపో పరిధిలో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలకు చెందిన ప్రయాణికులతో పాటు నరసరావుపేట, తాటికొండ నియోజకవర్గాలకు చెందిన ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బస్సుల్లో ఏర్పాటు చేయాల్సిన ఫస్ట్ ఎయిడ్ కిట్ల విషయంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీసీ సిబ్బందికి శిక్షణ సమయంలో ఖచ్చితంగా ప్రథమ చికిత్స గురించి తర్ఫీదిస్తారు. బాక్స్‌లో మందులు, సామాగ్రి లేకపోవడంతో సిబ్బంది కూడా చేసేదిలేక గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలిస్తున్నారు.

బాక్స్‌లో ఉండాల్సిన సామగ్రి

స్టెరిలైజ్డ్ కాటన్ బండిల్స్	:	2
ఎలాస్టిక్ బ్యాండేజ్ రోలర్స్	:	5
బెటాడియన్ ఆయింట్‌మెంట్ (యాంటీ సెప్టిక్ క్రీమ్)	:	1
డెటాల్ లేక స్యాక్లాన్	:	1
నియోసిన్ పౌడర్ డబ్బా	:	1
సర్జికల్ బ్లేడ్	:	1
బర్నాల్ ఆయింట్‌మెంట్	:	1
వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్, వైట్ ప్లాస్టర్ టేప్	:	1
బ్రాండెడ్ ఎయిడ్ ప్లాస్టర్, స్టెరిలైజ్డ్ ఎలాస్టిక్ ప్లాస్టర్లు	:	3

అన్ని బస్సుల్లో మెడికల్ కిట్లు ఏర్పాటు చేస్తాం

ఆర్టీసీ బస్సుల్లో మెడికల్ కిట్లు ఉండేలా వెంటనే చర్యలు తీసుకుంటాం. మెడికల్ కిట్లు అందుబాటులోనే ఉన్నాయి. ఏ ఏ బస్సుల్లో లేవో పరిశీలించి వాటిల్లో ఏర్పాటు చేయిస్తాం. బస్సుల్లో గడువు తీరిపోయిన కిట్లను తొలగించి అన్ని ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో కిట్లు ఏర్పాటు చేస్తాం.

–జీఎస్‌వీవీ కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్, సత్తెనపల్లి

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప మాలధారి మృతి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం తెల్లవారుజామున అయ్యప్పమాల ధరించిన పల్నాడు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారుజాము సమయంలో విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే జాతీయరహదారిపై ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వాహనం అయ్యప్ప మాల ధరించి ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని ఢీకొట్టింది. ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి వెళ్లిన సిబ్బంది బండి నంబరు ఆధారంగా మృతి చెందిన వ్యక్తి పల్నాడు జిల్లా, దాచేపల్లి మండలం, పెదగార్లపాడుకు చెందిన ఇంటూరి రాజేష్(32) గా గుర్తించారు. రాజేష్ అయ్యప్పమాల ధరించి విజయవాడలోని కనకదుర్గ అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చి ఈ ప్రమాదానికి గురయ్యాడు. ఢీకొట్టిన వాహనం ఎవరిది అనేది తెలియరాలేదని.. మృతుడి అన్నయ్య కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతి చెందిన రాజేష్‌కు భార్య ధనలక్ష్మితో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

